# దొరల సెమిటరీ

దాని పేరు సెమిటరి. ఎంతో ముద్దుగావుంది. మనమూ మృదువుగా స్మశానం అంటాంకాని పూడ్చిపెట్టేచోటు అని అనం ఎంచేతో. వాళ్ళు సెమిటరీని అందంగా నాజూకుగా నిర్మించుకుంటారు.

చుట్టూ ప్రహారిగోడ అట్టే ఎత్తులేకపోయినా రోడ్డుమీద నడుస్తుంటే చిన్న చిన్న గోపురాలు, క్రాసులు అన్నీ కన పడ్తాయి. అన్నిక్రాసులూ ఒకేవిధంగాలేవు. కొన్ని చిన్నవి, కొన్ని పెద్దవి...కొంతమంది బాగా డబ్బున్నవాళ్ళేమో క్రాసులుమీద "జెహోవా" విగ్రహాన్ని చెక్కించారు. క్రాసు చుట్టూ చిన్న ప్రహారిగోడ గొలుసు...అందంగా అమర్చబడి వున్నది. దాని దగ్గరే చిన్న చిన్న చెట్లు....అంత్యక్రియలు పరిశుభ్రంగా చేసుకుని క్రాసులు అందంగా కట్టుకుంటారు. శవాన్ని దహనం చెయ్యటానికి వాళ్ళ అంతరాత్మ ఒప్పుకో దేమో.

పాపం ఎక్కువగా దుఃఖం...చేతనేమో—మొగం కూడా పాలిపోయింది. పక్కనే ఇద్దరు ముగ్గురు పట్టుకునివున్నా తూలిపోతున్నది. స్పృహతప్పిపడిపోతే, ఆ చిన్నకుర్రాడూ-వాళ్ళూ అందరూ ముఖాన చల్లటి నీళ్ళు చల్లారు. ఎండి పోయిన దండవలె మరీ వంగిపోతున్నది. ఆమె కళ్ళల్లో ప్రాణం ఉంటుందో ఉండదో అని పక్కనున్న దొరసానులకు

అదుర్దా ఎక్కువైంది. తమ్ముడు వేడి "టీ" తీసుకునివచ్చి ఇచ్చాడు—మొగుడు ఒకవైపున చచ్చి...ఏడుస్తుంటే...టీ త్రాగడ మేమిటన్నా అనుకోరువాళ్ళు. టీ అందిస్తే గుటకలు వేయకలేక వేస్తూ నీరసంగా మింగుతున్నది. చెమటపోస్తే చేతిలోవున్న సంచిలోని చేరుమూలుతో అద్దడం ఆరంభించారు.

"జానీ! ఇహా ఈమెను అవతలకు తీసుక వెళదాం. సాహు-ఇంకొంచెం "టీ" తెస్తాడు. ఈవిడ ఇక్కడవుంటే మరీ కృంగిపోతున్నది." దొరసానులు వాళ్ళల్లో వాళ్ళు అనుకుంటున్నారు.

రెండుగజాల లోతున గుంటను త్రవ్వారు. దొరలు కొంతమంది శవపేటికను పూలతో అలంకరించారు. శవపేటికను భూగర్భంలో ఉంచిన తరువాత దొరలందరూ శాస్త్రార్థం కొంచెం మట్టిని తమతమ చేతుల్తో దానిమీద వేశారు. అందరూ తలలువంచి కొంచెం వెనక్కువచ్చి నిల్చున్నారు.

"ఆమె చేతిమీదుగా కొంచెం మట్టిని వేయించాలి... తరువాత తీసుకుపోదాం అవతలకు" అనుకున్నారు వాళ్ళల్లో వాళ్ళు మళ్ళీ.

ఆమె నడవలేక నడవలేక పడబోతూ అటువైపైనా చూడకుండా....వేపచెట్టువైపుచూస్తూ మట్టిని చిటికెడు తీసి వేసింది. గుబురు గుబురుగా మామిడిపళ్ళు కాడలతో వంగి శవపేటికను చూస్తున్నాయి. చీమ చిటుక్కుమన్నా వినవడుతున్నది సెమిటరీలో.

అన్నిప్రాసులకన్నా అందమైనది పెద్దది కట్టించారు

క్రాసు. దానిమీద, ఆ క్రాసు రెండుచేతులు చాచి రండి! రండి!! అని ఆహ్వానిస్తున్నట్లున్నది ... మెట్లు వరుసాగ్గా కట్టారు. అన్నిటికన్నా పై మెట్టుమీద క్రాసు...దానిచుట్టూ చిన్న ప్రహారీగోడ...గొలుసు....చాల అందంగా అమర్చారు... మెట్లమీద బాగా కనబడేట్లుగా ఏదో చెక్కించారు.

ఆ తరువాత ఆమె (దొరసాని) రోజూవచ్చి క్రాసు దగ్గర కొంచెంసేపు కూచుని....మెట్లమీద చెక్కించిన అక్షరాలు చదువుకుని మరల ఏడుస్తుంది...ఏమిటో తనలోతాను మాట్లాడు కుంటున్నది...ఒకరోజున ఏడ్చి ఏడ్చి అక్కడనే పడుకుంది.

మరోరోజు గేటుదగ్గరవుండే 'హెస్' ఆమెను లోపలకు పోనివ్వ లేదు. నిన్ను చూస్తే జాలివేస్తుంది—దుఃఖంతో చాలా కృంగిపోయినావ్ నీవు....ఆరోగ్యం పాడుచేసుకోకు, చచ్చి పోయినవాడు ఎట్లాగూరాడు ఇహ దుఃఖం ఉగ్గ్రమింగుకో అని చెప్పాడు. అక్కడికివెళ్ళి ఊరకే చూసుకుని వస్తానన్నది ఆకాశంవంక చూస్తూ దీనంగా.

"అతన్ని చంపేశాం!" నాలుగుసార్లు అనుకున్నారు నలుగురూ. భయంతోనే ఒక విధమైన సంతోషం.

"మనల్నెవరేం చేస్తారు భయందేనికి" అన్నాడు వాళ్ళలో ఒకతను.

"ఆమె ఎంతగా దుఃఖపడుతున్నదో పాపం"

"భూమి గిరగిరా తిరిగిపోతున్నట్లు ఆ క్రాసు మనల్ని రమ్మనమని పిలుస్తున్నట్లుగా వుంది."

"నాకు రోడ్డంతా నీలంగా కనపడ్తున్నది."

'అయినా ఒకసారి సెమిటరీలోకి వెళ్ళి చూసివద్దాం...'
'పంపటం న్యాయమంటావా ?'

"అది చంపబోయేముందు ఆలోచించవలసినమాట" ...సేమిటరీ గేటుదాటి లోపలికివెళ్ళి క్రాసుదగ్గర నిలుచున్నారు భయపడుతూ. ఒకరిమొగం ఒకరు చూసుకున్నారు. మెట్లమీద చెక్కివున్న అక్షరాలు పదేపదే చదువుకున్నారు. ఫలానా తారీఖున అర్థరాత్రి 'దొర' హత్య గావింపబడ్డాడు దారుణంగా అని, హత్యచేసిన వారిపేర్లూ మెట్లమీద చెక్కి ఉన్నాయి.

"పశ్చాత్తాపం అక్కరలేదు."

"పాపం ఆ దొరసానినిచూస్తె బావుండును. ఎంతగా కుమిలిపోతున్నదో."

"అయిన మనకుమాత్రం మరణదండన తప్పుతుందనీ నమ్మకం ఏమిటి ?"

"ఆయన మనకు చేసిన హాని ?"

"మనందరం కుట్రపన్ని చంపాం మనలో బేధాభిప్రాయాలెందుకు ?" వాళ్ళల్లోవాళ్ళు ఆ విధంగా తర్కించుకున్నారు.

"అధికారిని చంపితే అధికారం వస్తుందా ?" క్రాసు వాళ్ళని ఆ విధంగా అడుగుతున్నట్లనిపించింది.

వాళ్ళలోవాళ్ళు మాట్లాడుకున్నారు. వెనక్కుతిరిగి సెమిటరీదాటి తలలు వంచుకుని వెళ్తున్నారు.

ఆ క్రాసు రండి రండి రండి అని చేతులు చాపుతూ పిలుస్తున్నది వాళ్ళని !! (ఒక పట్టణంలో చూసిన సెమిటరీ మనసులో వుంచుకుని.)

సూర్యప్రభ

]o[